వన్యప్రాణుల దాహం తీరేదెట్ల?

- సాసర్ పిట్‌లలో నీటిని నింపని అటవీశాఖ అధికారులు
- దాహంతో అల్లాడుతున్న ప్రాణులు


అడివిలింగాల శివారు అటవీ ప్రాంతంలో నీరు లేక ఖాళీగా ఉన్న సాసర్‌పిట్

ఎల్లారెడ్డిరూరల్: వన్యప్రాణాలు దాహంతో అల్లాడుతున్నాయి. అడవిలోని సాసర్ పిట్‌లతో అధికారులు నీరు నింపడం లేదు. ఎండలు మండుతుండటంతో మూగజీవాలు దాహం తీర్చుకోవడానికి నానా తంటాలు పడుతున్నాయి. అడవిలో నీరు లేక వ్యవసాయ పొలాల్లోకి వస్తున్నాయి. దీంతో పంటలు పడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 90 హెక్టార్ల పరిధిలో అటవీ ప్రాంతం ఉండగా... దీని పరిధిలో 8 అటవీ శాఖ రేంజ్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 212 సాసర్‌పిట్‌లు ఉన్నాయి. వీటిలో అటవీ శాఖ అధికారులు నీరు నింపాల్సి ఉండగా ఇంత వరకు నీరు నింపలేదు. దీంతో అటవీ జంతువులు నీటి కోసం అడవిలో నుంచి బయటకు వస్తున్నాయి.

నీరు నింపాలి

సాసర్‌పిట్‌లలో నీరులేక పోవడంతో అటవీ జంతువులు పరిసర ప్రాంతాలలోని పొలాల్లోకి వస్తున్నాయి. సాసర్‌పిట్‌లలో నీరు ఉంటే అటవీ జంతువులు పొలాల్లోకి రావాల్సిన పరిస్థితి ఉండదు.

– ఆంజనేయులు, అడివిలింగాల

ప్రతిపాదనలు పంపించాం

సాసర్‌పిట్‌లలో నీటిని నింపేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే నీటిని నింపుతాం. అటవీ జంతువులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– ఓంకార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ఎల్లారెడ్డి

క్లుప్తంగా

వాటర్ ప్యూరిఫయర్ వితరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): బాయంపల్లి శివారులో ఏర్పాటు చేసిన రెన్యూ పవర్ ఆఫ్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ వారు బుధవారం లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలకు కూలింగ్ వాటర్ ప్యూరిఫయర్ వితరణ చేశారు. సంస్థ యాజమాన్యం 150 లీటర్ల సామర్థ్యం కలిగిన కూలింగ్ వాటర్ ప్యూరిఫైర్‌ను రూ.లక్షా మూడు వేల విలువతో కొనుగోలు చేసి పాఠశాలలో ఏర్పాటు చేశారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సిద్ధిఖీ మాట్లాడుతూ.. విద్యార్థులకు వేసవిలో చల్లని నీటిని అందించడానికి ఏర్పాట్లు చేసినందుకు సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



గాంధారి: ముదెల్లిలో చెరువులో పడి మృతి చెందిన చిన్నారులు రవి, శశాంక్ కుటుంబ సభ్యులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

మలిదశ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి



బాన్సువాడ: మలిదశ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా మాసాని శేఖర్‌రెడ్డిని బుధవారం బాన్సువాడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాన్సువాడ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాసాని శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొండ్ర భీంనాయక్, సత్యనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా బుర్రిగారి మహేష్, గంజీవార్ చందు, సహాయ కార్యదర్శిగా సాయికుమార్, తదితరులను ఎన్నుకున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా చందన శ్రీధర్


చందన శ్రీధర్

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా చందన శ్రీధర్ నియమితుడయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చందన శ్రీధర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తనను గుర్తించి పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికి తగిన ప్రాధాన్యత ఎమ్మెల్యే కాటుపల్లి వెంకటరమణారెడ్డి ఇస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బబ్లూ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బబ్లూను నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు బుధవారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, బబ్లూను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తు నియామక పత్రాన్ని అందించినట్లు వారు తెలిపారు.

ప్రతిభా పరీక్ష విజేతలకు బహుమతుల ప్రదానం

కామారెడ్డి టౌన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి ప్రతిభ పరీక్షా విజేతలకు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. జిల్లా కేంద్రంలోని లయోల స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి కృష్ణ, నితిన్, వేణు, సంతోష్ పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం

లింగంపేట(ఎల్లారెడ్డి): కోమట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందరర్భంగా 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి కింది తరగతులకు విద్యా బోధన చేశారు. ప్రధానోపాధ్యాయురాలుగా పావని, ఉపాధ్యాయులుగా మధు, అనిత, మేఘన, చరదణ్‌తేజ, మధు, ఆదిత్య వ్యవహరించారు. హెచ్ఎం రాజేందర్, ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నేతలను కఠినంగా శిక్షించాలి


కామారెడ్డి డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి టౌన్: కేరళ రాష్ట్రంలో వెటర్నరీ యూనివర్సిటీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న జేఎస్ సిద్ధార్థను మానసిక వేదనకు గురి చేసి ఆత్మహత్యకు ప్రేరేపించి హత్య చేశారని తక్షణమే కారకులైన ఎస్ఎఫ్ఐ నాయకులు కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ ఖలీల్, ఖేల్ కన్వీనర్ రోహిత్, నాయకులు రాజు, అల్తాఫ్, సాత్విక్, ప్రభు, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిర్ నూతన భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్‌లో సరస్వతి శిశు మందిర్ ప్రైమరీ స్కూల్ నూతన భవనాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ఆరేపల్లితండా పాఠశాల ఆకస్మిక తనిఖీ

రాజంపేట: ఆరేపల్లితండాలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు అయతా బాలాజి ఎలాంటి అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా పాఠశాలకు రావడం లేదు. దీంతో అక్కడ స్థానిక తండావాసులు వేతనం చెల్లించి పెట్టుకున్న ఉపాధ్యాయురాలే విద్యార్థులకు బోధిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ఉపాధ్యాయుడు అయతా బాలాజీ, ఎంఈవో రామస్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను వివరణ కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పన్నులు చెల్లిస్తేనే పంచాయతీల అభివృద్ధి


పన్నులు వసూలు చేస్తున్న కార్యదర్శులు

బాన్సువాడ రూరల్: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే పంచాయతీల అభివృద్ధి సాధ్యపడుతుందని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. బుధవారం బోర్లం గ్రామంలో ఇంటి పన్నుల వసూలు కోసం మండల పంచాయతీ కార్యదర్శుల బృందంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వంద శాతం పన్నుల వసూలుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యదర్శులు సాయి కుమార్, పుట్టి శ్రావణ్, శ్రీధర్‌రెడ్డి, పండరి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే వేతనాలు మంజూరు చేయాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం భోజన విరామ సమయంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లుగా ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా సకాలంలో వేతనాలు అందుకోలేకపోతున్నామన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ వేతనాలు సకాలంలో అందుతాయని భావించినప్పటికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మాచారెడ్డి: మండలంలోని రాజఖాన్‌పేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నౌసిలాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడగ్గానే సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయించిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ శాఖల సలహాదారు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సుంకపాక చంద్రం, మహేష్ నాయక్, సంజీవ్ కుమార్, జోగులు, రాజ్ కుమార్ ఉన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోరుబావి..


పనులు ప్రారంభిస్తున్న బోర్లం గ్రామస్తులు

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం ఎంపీపీ నీరజా వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో బోరుబాయి తవ్వించి మోటార్‌ను అమర్చారు. ఆలయ నిర్మాణానికి మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేశారు. నీటిసౌకర్యం లేకపోవడంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నట్లు సంఘం వారు తెల్పడంతో వెంటనే బోరు వేయించినట్లు ఎంపీపీ తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

కామారెడ్డి రూరల్: గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు మన ఊరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు గ్రూఫ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ కేశిరెడ్డి గురువేందర్‌రెడ్డి పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురువేందర్‌రెడ్డి మాట్లాడుతూ..పట్టుదలతో చదివి పరీక్షలు బాగా రాయాలని చెప్పారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్, మన ఊరు ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, సెక్రటరీ సత్యనారాయణ, శ్రీ ఆర్యభట్ట ప్రిన్సిపాల్ హన్మంత్‌రావు, పీజేఆర్ ప్రిన్సిపల్ విజయకుమార్, మంజీర కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కౌటిల్య ప్రిన్సిపల్ నరేష్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట టీఎస్ఎన్ఆర్ బాలుర పాఠశాలలో..

బీబీపేట: మండలంలోని ప్రభుత్వ టీఎస్ఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు బుధవారం బీబీపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సిరిగాద శంకర్ పరీక్షల సామగ్రి అందజేశారు. ప్యాడ్‌లు, పెన్నులు, జామెట్రీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు 10 జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

బొల్లారం హైస్కూల్లో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం హైస్కూల్‌లో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ మండలాధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ..పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, పీఈటీ నరేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మిద్దె రాములు తదితరులు పాల్గొన్నారు.

'కూలి బంధు ప్రకటించాలి'

భిక్కనూరు: రైతు బంధు పథకం మాదిరిగా ప్రభుత్వం కూలీలకు కూలి బంధు ప్రకటించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం జంగంపల్లిలో మల్లు స్వరాజ్యం కాలనీలో నిరుపేదలు నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎర్రజెండా పోరాట ఫలితంగానే జంగంపల్లి నిరుపేదలకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసిందన్నారు. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి



రామారెడ్డి: మద్దికుంట గ్రామంలో పది రోజుల నుంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి హరిలతకు గ్రామ యువకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీళ్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని బోరుబావులు ఎత్తిపోవడంతోనే సమస్య తలెత్తినట్లు అధికారులు చెబుతున్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి



రామారెడ్డి: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని రామారెడ్డి ఎంపీడీవో సవిత సూచించారు. బుధవారం గిద్ద గ్రామంలో ఉపాధి హామీ పనులను ఏపీవో ధర్మారెడ్డితో కలిసి పరిశీలించారు. ఎంపీడీవో సవిత మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకుని ఎక్కువగా తాగు నీటిని తీసుకెళ్లాలన్నారు. కొలతల ప్రకారం పని చేసి రూ.272 పొందాలని, గ్రామంలో అందరికి పని కల్పించాలని 100 మందికి తగ్గకుండా కూలీల హాజరు పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్యను ఆదేశించారు.

ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం


ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు నార్ల రాఘవేందర్

బాన్సువాడ: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలపడం హర్షణీయమని బాన్సువాడ ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు నార్ల రాఘవేందర్ గుప్తా తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయడం ఆనందంగా ఉందని, ఆర్య వైశ్యులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారని ఆయన అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పేద ఆర్యవైశ్యులకు మేలు జరుగుతుందని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం


భిక్కనూరులో క్షీరాభిషేకం చేస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు


తాడ్వాయి: ఎర్రాపహాడ్‌లో..

భిక్కనూరు/తాడ్వాయి: రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ భిక్కనూరు, తాడ్వాయి మండలాల్లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పండ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు.

ఏఈవోలు అందుబాటులో ఉండటం లేదు

- సర్వ సభ్య సమావేశంలో ప్రత్యేకాధికారుల ఆవేదన


మాట్లాడుతున్న ఎంపీపీ పాల్త్య విఠల్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ఆయా క్లస్టర్ల హెడ్‌క్వార్టర్లలో ఏఈవోలు అందుబాటులో ఉండటం లేదని వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీపీ పాల్త్య విఠల్ అధ్యక్షతన నిర్వహించిన సర్వ సభ్య సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వ్యవసాయంపై అవగాహన కల్పించి, పంట పొలాల్లో వచ్చే చీడపీడల నివారణ కోసం రైతులకు వివరించాల్సిన ఏఈవోలు గ్రామాల్లో ఉండటం లేదని ప్రత్యేక అధికారులు అన్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేదన్నారు. జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీకి తెలియజేశారు. అంతే కాకుండా నిజాంసాగర్ 23వ ఉపకాలువ కింద గల పంట కాలువలో మట్టి కూరుకుపోయిందని దీని కారణంగా పంట పొలాలకు నీరు అందడం లేదన్నారు. కరెంటు అందక రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో నీలావతి, జెడ్పీ కోఆప్షన్ మాజీద్ ఖాన్, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి మడిగెకు టెండర్లు వేయాలని వినతి


ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి సంబంధించిన మడిగెకు టెండర్ నిర్వహించాలని బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రి 16వ మడిగెను గతంలో ఓ వ్యక్తికి టెండర్ ద్వారా కేటాయించారని, ప్రస్తుతం ఆ వ్యక్తి చనిపోవడంతో ఆయన పేరుపై ఉన్న మడిగెకు టెండర్ నిర్వహించాలని కోరారు. ఆస్పత్రి మడిగెలు దక్కించుకున్న కొందరు ఆస్పత్రికి తక్కువగా అద్దెను చెల్లిస్తూ ఇతరులకు ఎక్కువ అద్దెకు ఇచ్చారని తెలిపారు. బినామీ పేర్లపై ఉన్న మడిగెలను గుర్తించి రీటెండర్లు నిర్వహించాలని కోరారు. బీజేపీ నాయకులు గుడుగుట్ల శ్రీనివాస్, ప్రసాద్‌లు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ


ఎల్లారెడ్డిలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న నేతలు

ఎల్లారెడ్డి: మరోసారి మన మోదీ సర్కార్.. దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం అంటూ ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి గురించి అభిప్రాయ సేకరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని షెడ్ల సీజ్


షెడ్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో అనుమతులు లేని దుకాణ, రేకుల షెడ్లను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు, దేవునిపల్లి రోడ్, హౌజింగ్‌బోర్డు ప్రాంతాలలో అనుమతుల్లేని, ఇంటి నంబర్లు లేని దుకాణదారులకు మున్సిపల్ కమిషనర్ సుజాత నోటీసులు అందజేసి వాటిని సీజ్ చేశారు. మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకుని, ఇంటి నంబర్‌తో ఆస్తి పన్నులు చెల్లించి బల్దియా అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి రవి గోపాల్‌రెడ్డి, ఆర్ఐ జానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

తిర్మలాపూర్‌లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బాన్సువాడ రూరల్: తిర్మలాపూర్ గ్రామంలో పద్మావతి సమేత శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభించినట్లు ఆలయ ధర్మకర్తలు తూప్రాన్ జయశ్రీ, శంకర్‌గౌడ్‌లు తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు.

కోటదుర్గమ్మ ఆలయంలో చండీహోమం



బాన్సువాడ: పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పత్తి శ్రీకాంత్, ఉప్పరి లింగం తదితరులున్నారు.

కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో కట్టమైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బోనాలను గ్రామంలో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు.

భగవంతుని అనుగ్రహంతో మానసిక ప్రశాంతత



బీబీపేట: ఏ సమస్యలొచ్చినా భగవంతుని అనుగ్రహం ఉంటే మానసిక ప్రశాంతత దొరుకుతుందని శ్రీరామ కోటి జపలిఖిత ప్రచారకులు శ్రీ కృష్ణానంద స్వామి అన్నారు. బుధవారం జనగామ మద్రి ఉన్నటువంటి శ్రీ శ్రీనివాస గాయిత్రి యోగాశ్రమం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆయన విశ్వ శాంతి యజ్ఞం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు రాంచంద్రరావు, భక్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుపై రైతుల హర్షం

బాన్సువాడ రూరల్: బోర్లం శివారులో పంట పొలాలకు విద్యుత్ సరఫరా చేసే 3 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి ఆయిల్, కాపర్‌ను దోచుకెళ్ళారు. కరెంటు లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ట్రాన్స్‌కో ఎస్ఈతో మాట్లాడి 3 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయించారు. వెంటనే వాటిని బిగించి గురువారం రైతుల బోరుబావులకు విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. దీంతో రైతులు ఏనుగు రవీందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.